క్లుప్తంగా

నేడు ఎస్‌జీఎఫ్ గేమ్స్‌పై సమావేశం

రాజుపాళెం : రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించే పోటీలపై శుక్రవారం హెచ్ఎం అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు రాజుపాళెం జెడ్పీహెచ్ఎస్ పీడీ ఎంసీ సుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీఈటీలు, ఎస్ఏపీఈలు హాజరు కావాలని ఆయన చెప్పారు. మండల స్థాయిలో ఈ పోటీలు రాజుపాళెంలో నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల విద్యార్థులు రావచ్చునన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ఖాజీపేట : అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఖాజీపేట సీఐ మోహన్ హెచ్చరించారు. మిడుతూరు సమీపంలో అక్రమంగా ఇసుకతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇసుక రవాణా చేసుకోవచ్చునని అన్నారు. అక్రమ రవాణా చేయరాదని అన్నారు. ఎవరైనా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : దొరసానిపల్లెలో సర్వే నంబర్ 31లో ఉన్న గ్రామకంఠం స్థలంలో ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామానికి చెందిన జి.కేశవ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్వేనంబర్ 47లో తమకు 4.50 స్థలం ఉందన్నారు. తమ సర్వేనంబర్ పక్కనే ఉన్న సర్వేనంబర్ 31లోని గ్రామ కంఠం స్థలంలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయగా మిగిలిన స్థలం ఖాళీగా ఉందన్నారు. ఆ ఖాళీ స్థలాన్ని, రోడ్డును ఆక్రమించి కొంతమంది కాంపౌండ్‌వాల్ నిర్మించారన్నారు. దీనివల్ల రోడ్డు లేక అక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఖాజీపేట : ఇంటిలో ఉంచుకుని మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని ఖాజీపేట సీఐ మోహన్ అదుపులోకి తీసుకున్నారు. చెమ్ముళ్ళపల్లె పంచాయతీ ములపాక గ్రామంలో చెన్నయ్య అనే వ్యక్తి ఇంటిలో మద్యం బాటిళ్లు పెట్టుకుని అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సీఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఇంటిలో నిల్వ ఉన్న 13 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మైదుకూరు : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మైదుకూరు జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం ప్రొద్దుటూరు జార్జికారొనేషన్ క్లబ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–19 యోగా పోటీలు జరిగినట్టు పాఠశాల పీడీ వినోనియా రాణి తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన జి.కార్తికేయుడు, టి.నాగేంద్ర, షాహిద్ బాష, జె.అజయ్‌లు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోశెట్టి రామమోహన్, వినోనియారాణి, చంద్రావతి తదితరులు అభినందించారు.

ఎంపీటీసీ మృతికి నివాళి

దువ్వూరు : మండలంలోని దాసరిపల్లెలో ఎంపీటీసీ నాయినేని సుబ్బరాయుడు మృతదేహాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి సందర్శించి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. సుబ్బరాయుడు మంచి మనిషి అని, నీతి నిజాయితీకి నిలువుటద్దమని తెలిపారు. వారి కుటుంబానికి శ్రీవెంకటేశ్వరస్వామి ధైర్యం, స్థైర్యం, మనో నిబ్బరాన్ని ఇవ్వాలని ప్రార్థించినట్లు చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని చెన్నమరాజుపల్లె రహదారిలో రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను రూరల్ పోలీసులు సీజ్ చేశారు. అమృతానగర్ నుంచి వెళ్తున్న ఆటోను రూరల్ ఎస్ఐ సురేష్ గురువారం తనిఖీ చేయగా అందులో 12 రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయి. పట్టుబడిన బియ్యం బస్తాలు మైదుకూరు మండలంలోని గొల్లపల్లె గ్రామస్తుడైన పవన్‌కల్యాణ్‌కు చెందినవిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.1.75 కోట్లకు ఎగ్జిబిషన్ వేలం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అధ్యక్షతన గురువారం ఎగ్జిబిషన్ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేందుకు మొత్తం 18 మంది పాటదారులు హాజరయ్యారు. ఇందులో ఆర్.చలపతి అనే వ్యక్తి రూ.1.75 కోట్లతో దక్కించుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రూ.కోటి 20 లక్షల నుంచి వేలం పాటను ప్రారంభించగా పాటదారులు పోటాపోటీగా వ్యవహరించి రూ.1.75 కోట్ల వరకు పాడారు. వేలం పాటదారుడు 18 శాతం జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,06,50,000 చెల్లించాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. గత ఏడాది రూ.కోటి 17 లక్షలకు వేలం పాట పలికింది. పట్టణంలోని పలు ముఖ్య నేతలు వేలం పాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తోపాటు ఆర్ఓ కనికరం శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని గ్రామోత్సవం


ప్రొద్దుటూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


చాపాడు మండలం రామదాసుపురంలో ఊరేగింపు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో కొలువు దీరిన బొజ్జగణపయ్యలను కొందరు గణపతి ఉత్సవ కమిటీల వారు గురువారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లలోకి ఎక్కించి చెక్కభజనలు, డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ పుర వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. గణనాథుని విగ్రహాలను పెన్నానది, చాపాడు, కామనూరు వద్ద ఉన్న కుందూనదిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఆరో రోజు..

చాపాడు : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఆరో రోజైన గురువారం నిమజ్జనం చేశారు. రామదాసుపురం గ్రామంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని ప్రత్యేక పూజలు, బాణా సంచా పేల్చుతూ, తప్పెట్ల సందడి మధ్య నిమజ్జనానికి తరలించారు. సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద గల కుందూనదిలో చాపాడు మండలంతోపాటు ప్రొద్దుటూరు, మైదుకూరు గ్రామాల నుంచి తీసుకువచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ చిన్న పెద్దయ్య పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ అసమర్థత కప్పిపుచ్చుకునేందుకే రాజకీయం


మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : కూటమి ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకే వరదలో బురద రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై ఎన్ని రకాల గ్లోబెల్స్ ప్రచారం చేసినా విజయవాడలో లక్షలాది మంది నిరాశ్రయులైన విషయాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు మరణించిన సంఘటనను మరుగున పరచటం సాధ్యం కాదన్నారు. రెడ్యం గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలైన నీటి పారుదల, వాతావరణ శాఖలు సమాచారం ఇస్తే ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లనే 60 మందికి పైగా ప్రజలు మరణించారని అన్నారు. ముందస్తుగా ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించి ఉంటే ఇంత పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లేది కాదన్నారు. ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బోట్ల కుట్ర పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోందన్నారు. ఇలాంటి చౌకబారు రాజకీయం చేయడం తగదన్నారు. వరదలు వచ్చి ఇన్ని రోజులవుతున్నా తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో లక్షలాది మంది ప్రజానీకం నరకయాతన అనుభవిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ పైనా, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై బురద చల్లడం మాని వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోకపోతే చరిత్ర హీనులవుతారన్నారు. వరద పూర్తిగా తగ్గుముఖం పట్టినా కనీస వసతులు ప్రభుత్వం కల్పించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలను విమర్శించటం మాని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు సాయం


వరద బాధితులకు అందించేందుకు సిద్ధం చేసిన కిట్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడ వరద బాధితులకు ది బీసీ ప్రజాచైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో చేయూత అందించనున్నట్లు ఆ సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాతల ద్వారా విరాళాలు సేకరించామన్నారు. ఈ మొత్తంతో దుప్పట్లు, టవల్, బియ్యం, చింతపండు, బస్సీరవ్వ, నూనె తదితర వాటితో దాదాపు 500 కిట్లు రూపొందించామన్నారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు ప్రతాప్, ఆర్.ప్రభుకుమార్, జీసీ.పుల్లయ్య, శ్రీనివాసులు, మల్లేష్, పరమేశ్వరరావు, సుంకర వేణు, క్రిష్ణయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ యూనియన్ ఆధ్వర్యంలో..

ది ప్రొద్దుటూరు పాత ఆటోనగర్ యూనియన్, మజీదే బిలాల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేయనున్నట్లు యూనియన్ నిర్వాహకులు తెలిపారు. గురువారం రాత్రి రూ.6 లక్షలు విలువ చేసే నిత్యావసర వస్తువులతో బయలుదేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం వరద బాధితులకు 700 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను అందించనున్నట్లు వారు వివరించారు.

విరాళాల సేకరణ

బద్వేలు అర్బన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం గురువారం పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు ఫాతిమా, ఖలీల్‌బాష, రూరల్ కార్యదర్శి బాలగురయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు


స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వర్‌కుమార్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్ల యజమానులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీపీఎన్‌డీటీ (లైంగిక ఎంపిక నిషేధ చట్టం) యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.ఉమామహేశ్వర్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రైవేటు ఆసుపత్రులకు, స్కానింగ్ సెంటర్లకు అనుమతులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్, ఫైర్ ఎగ్జిస్టింగ్ మెయింటెనెన్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డిస్ట్రిక్ మాస్ మీడియా ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రమణమ్మ, స్కానింగ్ సెంటర్ అడ్వైజర్ పాలేశ్వరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఆయా ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

ప్రసాదరావుకు గడియారం పురస్కారం


డాక్టర్ రామకృష్ణ ప్రసాదరావు

ప్రొద్దుటూరు కల్చరల్ : కవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, వైద్యుడు డాక్టర్ శింగరాజు రామకృష్ణ ప్రసాదరావుకు అందించనున్నట్లు శ్రీ శివ భారతి విద్యా పీఠం కార్యదర్శి గడియారం శేషశర్మ తెలిపారు. రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల ఆధ్వర్యంలో అక్టోబర్ 6న స్థానిక గీతాశ్రమంలో జరిగే గడియారం వేంకటశేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభలో ఆయనకు ఈ పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు. 1982 నుంచి ప్రతి ఏడాది రాష్ట్ర స్థాయిలో కావ్యాల పోటీలను నిర్వహించి ఎంపిక చేసి పురస్కారాలను అందిస్తున్నామని వివరించారు. వత్తి రీత్యా డాక్టర్‌గా సేవలందించడంతోపాటు కవిగా డాక్టర్ రామకృష్ణ శ్రీ శంభుభారతం, పంచతంత్రంలో పంచతంత్రం, ఆశుకవి సామ్రాట్టులు, అవధాన సార్వభౌములుశ్రీ కొప్పరపు సోదర కవుల చరిత్ర వంటి అనేక రచనలు చేశారన్నారు. 2024 సంవత్సరానికి గాను ఆయన రచించిన శ్రీ శంభు భారతం అనే కావ్యానికి గడియారం పురస్కారం అందిస్తున్నామన్నారు. ఈయనకు అవార్డుతోపాటు రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రం అందిస్తున్నామని వివరించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక సీపీఎం కార్యాలలయంలో గురువారం సీపీఎం ఆల్ ఇండియా కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న జన్మించారని తెలిపారు. 1975లో సీపీఎంలో ఆయన కీలక బాధ్యతలు తీసుకుని 2015 హైదరాబాద్‌లో జరిగిన మహాసభలో ఆల్ ఇండియా కార్యదర్శిగా ఎన్నికయ్యారన్నారు. పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తారన్నారు. ఆయన లేని లోటు కార్మిక, పేద ప్రజానీకానికి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పక్కీరయ్య, సల్మాన్, రాఘవ, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, భానుమతి, డీవైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు చంటి, అవాజ్ నాయకులు మహబూబ్ బాషా, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ

బి.కోడూరు : బి.కోడూరు ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పరిశుభ్రతతోనే నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన ప్రతిఒక్క విద్యార్థి చేత ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని, 17వ తేదీన మింగించని వారికి 25వ తేదీన మాత్రలను మింగించాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

ప్రొద్దుటూరు కల్చరల్ : నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమాఅతే ఇస్లామి హింద్ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి హుమైరా భాను పేర్కొన్నారు. స్థానిక ఖాదర్‌హుసేన్ మసీదు వీధిలోని జమాత్ కార్యాలయంలో గురువారం నైతికతే నిజమైన స్వేచ్ఛ దేశవ్యాప్త జాగృతి ఉద్యమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వేచ్ఛ అంటే కళ్లెంలేని గుర్రంగా ఇష్టమొచ్చినట్లు జీవించడం కాదని, మితిమీరిన స్వేచ్ఛ అనర్థాలకు దారితీస్తుందన్నారు. నైతికంగా దిగజారే స్వేచ్ఛ నిజమైన స్వేచ్ఛ కాదని, తమ ఉద్యమ లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రెహాన, పట్టణాధ్యక్షురాలు హసీనా, అయిషా, మహబూబ్‌చాన్, గులాబ్‌జాన్, అయిషాకౌసర్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో ఉపయోగం

అట్లూరు : వరినాట్ల సమయంలో కాలిబాటలు వదలడం ఎంతో ప్రయోజనకరమని బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండలం చింతలచెరువు రైతుసేవా కేంద్రం పరిధిలోని బయనపల్లె గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు వరినాట్లు వేస్తున్న దగ్గరికి వెళ్లి వరినాట్ల సమయంలో కొనలు తుంచి నాటాలని, అలాగే తూర్పు, పడమర దిశగా కాలిబాటలు వదలాలని, దీంతో మందులు పిచికారి చేసుకునేందుకు వీలుగా ఉండటంతోపాటు నాటిన మొక్కలకు అవసరమైన మేర గాలి అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు పవన్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జంగయ్య, నారుబోయినవీరశేఖర్, సుమలత, లీలావతి, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

అట్లూరు : బద్వేలు మండలం రాజుపాలెం గ్రామంలోని శ్రీజమదగ్ని సమేత శ్రీకవలకుంట్ల రేణుకా యల్లమ్మతల్లి దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలు వేదపండితులు కనుమళ్ళ సత్యనారాయణశర్మ ఆచారత్వమున ఉద్యాలక్ష్మీ నరసయ్యశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో పశువులకు గాయాలు

చాపాడు : నాగులపల్లెలో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు లక్కిరెడ్డి రామకృష్ణారెడ్డి వివరాల మేరకు.. రేకుల షెడ్‌తో కూడిన పశువుల పాకలో రోజూమాదిరిగానే ఎనుములు, దూడలను కట్టి ఉంచారు. పశువులకు దోమలు కుట్టకుండా ఫ్యాను, లైటు ఏర్పాటు చేశారు. విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావటంతో పై కప్పు రేకుల కింద ఉన్న ఈత చాప అంటుకుంది. అది పూర్తిగా కాలి పశువుల మీద పడటంతో వాటి చర్మం కాలింది. రెండు పశువులు అగ్గి వేడికి తట్టుకోలేక తాళ్లు తెంచుకుని బయటికి వెళ్లాయి. వీటిని గమనించిన చుట్టు పక్కల ప్రజలు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తూ పశువులకు బయటికి తీసుకువచ్చారు. పశువుల చర్మం కాలిపోయి తీవ్ర గాయాలు కాగా పశువైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పశు వైద్య సిబ్బంది చికిత్స అందించి పశువులు ప్రాణపాయ స్థితి నుంచి బయట పడ్డాయని చెప్పటంతో బాధిత రైతు ఊపిరి పీల్చుకున్నాడు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో
ఉన్నత లక్ష్యాలు సాధ్యం


మాట్లాడుతున్న ఏఐ నిపుణుడు మధుబాబు

మైదుకూరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంచుకొని దైనందిన జీవితంలో ఉపయోగించడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని బెంగళూరుకు చెందిన ఏఐ నిపుణుడు పి.మధుబాబు తెలిపారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గణిత శాస్త్ర విభాగ అధ్యాపకుడు ఎస్.నవనీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్‌పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)ను వినియోగించి సంక్లిష్టమైన కార్యకలాపాలను అతి సులువుగా చేసుకునేటువంటి సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రతి వ్యక్తి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకతను గుర్తించి సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా అధ్యాపకులు ఏఐని ఉపయోగించి అతి సులువుగా ఎల్ఎంఎస్ వీడియో లెసన్స్‌ని జనరేట్ చేయడం, ఎడిటింగ్, లెసన్ ప్లాన్ డ్రాఫ్టింగ్ రీసెర్చ్, టీచింగ్‌లో వినియోగించి సులువుగా తమ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చని తెలిపారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నిపుణుడు బీవీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ చేయడం ద్వారా ఎక్కువ మార్కులు పొందవచ్చన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని జీవితాన్ని పెంపొందించుకోవడం చాలా ముఖ్యమన్నారు. సంపూర్ణమైన మూర్తిమత్వాన్ని పెంపొందించుటకు యోగా, మెడిటేషన్, పాజిటివ్ థింకింగ్, సోషల్ బిహేవియర్ లాంటి అనేక అంశాల పట్ల అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన పెంచుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, అయ్యవారురెడ్డి, నరసింహారెడ్డి, చెన్నరాయుడు, సుబ్బరాయుడు, రామేశ్వర్‌రెడ్డి, రాధారామ్, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన


అడల్ట్ బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టీబీ రోడ్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి 6వ సచివాలయంలో గురువారం క్షయ వ్యాధి నివారణపై జిల్లా టీబీ కోఆర్డినేటర్ శంకర్, టీబీ సూపర్‌వైజర్ బి.రాజారత్నం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు ఉన్నా.. ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు కఫంతోపాటు రక్తపు జీరలు పడినా క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. తక్షణమే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వెంటనే చికిత్స తీసుకోవాలని తెలిపారు. అనంతరం 18 మందికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీఓ ఎంవీ సుబ్బారెడ్డి, టీబీ హెచ్‌వీ సిద్ధారెడ్డి, ఏఎన్ఎంలు రెబక, జ్యోతి, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


ఆలయం వద్ద ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేతలు

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లెలో గురువారం శ్రీ సీతాలక్ష్మణ హనుమత్సమేత రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పీఆర్ అండ్ ఆర్డీ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ స్టేట్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీ సీఎం బాషా పాల్గొన్నారు. దమ్మన్నపల్లెలో నిర్మించిన నూతన ఆలయంలో మూడు రోజులుగా వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, నూతన విగ్రహాలు ప్రతిష్ఠించారు. అనంతరం శాంతికల్యాణం, గ్రామోత్సవం చేశారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేసిన ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులకు నిర్వాహకులు స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ వెంట రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచులు నాగేంద్రప్రసాద్, రవిచంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, నాయకులు పుల్లారెడ్డి, శివయ్య, సుబ్రమణ్యం, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, గంగయ్య, రుద్రవరం రాము, బాలుడు తదితరులు పాల్గొన్నారు.

తొలి దశలోనే గుర్తిస్తే ప్రయోజనం


రాజుపాళెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

రాజుపాళెం : పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని తొలి దశలోనే గుర్తిస్తే ప్రయోజనం ఉంటుందని కడప ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.అంకయ్య కుమార్ పేర్కొన్నారు. ఆయన రాజుపాళెంలో గురువారం పత్తి పంటను పరిశీలించారు. అనంతరం చిన్నశెట్టిపల్లెలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా రిసోర్స్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పత్తి పంటపై గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అలాగే పంటలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జొన్న, మొక్కజొన్నలో కత్తెర పురుగు దాడి చేస్తూ పంటను దెబ్బతీస్తుందని, ఇందుకు కూడా పై పద్ధతులను అవలంబించాలన్నారు. జిల్లా రీసోర్స్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణారెడ్డి మాట్లాడుతూ గులాబీ రంగు, కత్తెర పురుగుల నివారణపై అవగాహనకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైదుకూరు ఏడీఏ ఎం.కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి ఎస్.శివరామ కృష్ణారెడ్డి, వీఏఏలు సుమలత, సుధాకర్, జయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల చెరువుకు
నీటిని విడుదల చేయండి


పోరుమామిళ్లను చెరువును పరిశీలిస్తున్న మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువుకు ఇంత వరకు తెలుగుగంగ నీరు విడుదల చేయకపోవడం దారుణమని మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పోరుమామిళ్ల చెరువును సందర్శించారు. చెరువులో ఎక్కడా చుక్క నీరు లేదని, దీనిపై ఆధారపడి రెండు వేల ఎకరాల్లో పైరు సాగు చేశారని తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి నీరు వస్తుందనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. నెల రోజులుగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బ్రహ్మంసాగర్‌కు నీరు వస్తోందన్నారు. బ్రహ్మంసాగర్ ఎడమ కాలువకు నీరు వదిలితే బి.మఠం, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల్లోని రైతాంగం పైర్లు కాపాడుకుంటారని, సాగు చేసుకుంటారని అన్నారు. ఏటా ఆగస్టులో నీరు వదిలేవారని, ఇప్పుడు సెప్టెంబర్ వచ్చినా విడుదల చేయక పోవడంతో చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఈ సంవత్సరం తక్కువ వానలు కురిశాయని, సాగునీటికి, తాగునీటికి ఇబ్బంది తలెత్తిందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి వెంటనే నీరు విడుదల చేసి ప్రజలు, రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కాశినాయన : బాలరాజుపల్లెలో పౌష్టికాహారంపై వివరిస్తున్న సీహెచ్ఓ భవ్య

కాశినాయన : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భవతులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీహెచ్ఓ భవ్య తెలిపారు. గురువారం మండలంలోని బాలరాజుపల్లె అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త సుభాషిణి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భవ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, కూరగాయలు, గుడ్లు, పాలు తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి విజయ, అంగన్వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, క్రిష్ణమ్మ, పీరమ్మ, ప్రమీల, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

చాపాడు : గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నరహరిపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి నసీమూన్, అంగన్వాడీ వర్కర్లు మునిప్రవీణ, జయలక్ష్మి, హెల్పర్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.